
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


శ్రీగిరిపై శివోహం



శ్రీశైలం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నమైంది. స్వామివారికి అత్యంత ఇష్టమైన శివరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ఆరంభం కానున్నాయి. శివమాలధారులు, సాధారణ భక్తులు ఇప్పటికే వేలాదిగా శ్రీశైలానికి చేరుకుంటున్నారు. శ్రీశైలం మహాక్షేత్రంలో బుధవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను దేవస్థానం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. భక్తుల సౌకర్యాలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో అన్ని ఆర్జిత సేవలను నిలుపుదల చేశారు. ఉత్సవాల సందర్భంగా 23వ తేదీ వరకు జోతిర్ముడి కలిగిన భక్తులకు మాత్రమే నిర్ణీత వేళలో స్వామివారి స్పర్శదర్శనం కల్పించనున్నారు. అదేవిధంగా ప్రముఖులకు 4 విడతలుగా విరామ వేళల్లో దర్శనం కల్పిస్తారు. ఉదయం 6:30 నుంచి 7:30 వరకు, 10:30 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 3 గంటల వరకు రాత్రి 7 నుంచి 7:30 వరకు ప్రముఖులకు దర్శనం కల్పిస్తారు.

క్యూలైన్లు ఇలా...

భక్తుల సౌకర్యార్థం ఉచిత దర్శనం రథశాల నుంచి క్యూలైన్ల వరకు, ఉచిత స్పర్శ దర్శనం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయ ప్రవేశ ద్వారం వరకు శీఘ్రదర్శనం లలితాంబికా కాంప్లెక్స్ ముందు భాగం నుంచి ఏర్పాటు చేశారు. అతిశీఘ్రదర్శనం (రూ.500) క్యాంపు కోర్టు నుంచి క్యూలైన్ల వరకు ఏర్పాటు చేశారు. శివదీక్షా పరులకు ఆలయ ఉత్తర భాగాన చంద్రావతి కల్యాణ మండపం నుంచి ప్రతేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

నేడు యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం

శ్రీగిరిపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం యాగశాల ప్రవేశంతో ప్రారంభమవుతాయి. పదకొండు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు వివిధ సేవలు నిర్వహిస్తారు. తొలిరోజున సాయంత్రం ధ్వజారోహణం, భేరిపూజ, ధ్వజపటం ఆవిష్కరణ చేసి సకల దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తారు. తర్వాతి రోజు నుంచి స్వామి అమ్మవార్లకు రోజుకో వాహనసేవ, అమ్మవారికి ప్రతేక అలంకారంతో ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహిస్తారు. మహాశివరాత్రి రోజున సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ప్రభోత్సవం, రాత్రి లింగోద్భవ సమయంలో మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఇదే సమయంలో కీలకఘట్టం స్వామివారి ఆలయానికి పాగాలంకరణ కార్యక్రమం కూడా జరుగుతుంది. ఈ సమయంలో ప్రధాన ఆలయం లోపల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. లింగోద్భవ కార్యక్రమం అనంతరం స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మరుసటి రోజు రథోత్సవం, తెప్పోత్సవం నిర్వహిస్తారు. పదో రోజు యాగపూర్ణాహుతి, సదస్యం, నాగవల్లి, ఆస్థానసేవ, సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించి, చివరిరోజు అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవంతో ఉత్సవాలను ముగిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు వివిధ దేవస్థానాల నుంచి పట్టు వస్త్రాలను అందజేస్తారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన మొదటి రోజు శ్రీకాళహస్తీశ్వర ఆలయం, 20న ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం, 21న విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం, 22వ తేదీ ఉదయం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు అందజేస్తారు. కాగా ఈ నెల 23వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

- నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- అన్ని ఆర్జిత సేవలు నిలుపుదల
- 23న పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం
- 26న కీలకఘట్టం.. పాగాలంకరణ
- మార్చి1తో ఉత్సవాల ముగింపు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు





ఉత్సవాలు ఇలా..

19వ తేదీ	ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం
20వ తేదీ	భృంగివాహనసేవ
21వ తేదీ	హంసవాహనసేవ
22వ తేదీ	మయూర వాహనసేవ
23వ తేదీ	రావణ వాహనసేవ
24వ తేదీ	పుష్పపల్లకీ సేవ
25వ తేదీ	గజవాహనసేవ
26వ తేదీ	మహాశివరాత్రి, పాగాలంకరణ, కల్యాణోత్సవం
27వ తేదీ	రథోత్సవం, తెప్పోత్సవం
28వ తేదీ	యాగపూర్ణాహుతి, ధ్వజావరోహణ
మార్చి 1	అశ్వవాహనసేవ, పుష్పోత్సవం

భక్తులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ఈ నేపథ్యంలో దేవస్థానం, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేశాం. పాదయాత్రగా అటవీ మార్గాన శ్రీశైలం దర్శనానికి విచ్చేసే భక్తులకు ప్రత్యేకంగా తాగునీరు, అన్నదానం, సేదతీరేందుకు చలువ పందిర్లను, 10 చోట్ల వైద్యశిబిరాలను ఏర్పాటు చేశాం. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం అందించేందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశాం. భక్తులకు మంచినీరు, అల్పాహారం అందజేస్తాం. లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద ఎక్కువ సమయం వేచివుండకుండా 15 శాస్వత కౌంటర్లు, అదనంగా అన్నప్రసాద వితరణ వద్దద 4, గణేష సదనం వద్ద 2, సీఆర్వో కార్యాలయం వద్ద 2 అదనపు ప్రసాద విక్రయకేంద్రాలు ఏర్పాటు చేశాం. భక్తులకు ఉచిత లడ్డు, వాటర్ బాటిల్ అందజేస్తాం.

- ఎం.శ్రీనివాసరావు, ఆలయ ఈఓ

రాష్ట్రాభివృద్ధికి టీడీపీ పని చేస్తుంది

- జిల్లా రోడ్లను జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తాం
- రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పత్తికొండ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి టీడీపీ పనిచేస్తుందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పత్తికొండ ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల అనాలోచిత పాలన వల్ల రాష్ట్రంలో అభివృద్ధి అధోగతిపాలైందని అన్నారు. రాష్ట్రానికి జీవనది పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలమైందని అన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే పోలవరం పూర్తి చేసి, ఆ జలాలను అన్ని ప్రాంతాలకు అందించేలా పనులను చేపట్టిందన్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఒక్క కిలోమీటర్ కూడా రహదారుల నిర్మాణం చేపట్టలేదని, 47వేల కిలోమీటర్ల రహదారులను నిర్మాలించలేదని ప్రచారం చేసుకున్నారన్నారు. ఎన్‌డీబీ కింద జరిగిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎందరో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ చెల్లించకుండా వదిలేసిన ఎన్‌డీబీ బిల్లులు రూ.1500 కోట్ల మేర చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకున్నామన్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో రవాణా సౌకర్యం లేక ఫ్యాక్టరీలు పక్కరాష్ట్రాలకు వలస పోయాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక కర్నూలు జిల్లాలో 802 కిలోమీటర్ల మేర రహదారుల మరమ్మతులకు రూ. 21 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. 97 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. పీపీబీ విధానం ద్వారా రహదారులను ఆధునికీకరించేందుకు సిద్ధమవుతున్నామని, అందుకోసం ఫేజ్-1 కింద 1300 కిలోమీటర్లు, పేజ్-2 కింద 1700 కిలోమీటర్లు రహదారులు వేసేందుకు ప్రణాళికలు పూర్తి చేయడంతోపాటు డీపీఆర్ కింద రూ.37 కోట్లు నిధులు విడుదల చేశామన్నారు.

యాగంటి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి: మంత్రి బీసీ



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి బీసీ

బనగానపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యాగంటి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం యాగంటి క్షేత్రంలో యాగంటి ఈవో చంద్రుడు, ఇతర శాఖల అధికారులతో మంత్రి బీసీ యాగంటి బ్రహ్మోత్సవాల చరిత్రలో తొలిసారి మంత్రి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రికి ఆలయ ఈవో, సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి బీసీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. క్యూలైన్ల ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం, వైద్యం, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయా శాఖాధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో వరుసగా 25,26,27 తేదీల్లో మూడు రోజుల పాటు వాహన దారులనుంచి టోల్‌గేట్ వసూలు చేయరాదని ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఐదు రోజుల పాటు తానే రూ. 7 లక్షలు సొంత డబ్బుతో భక్తులకు ఉచిత లడ్డూలను అందిస్తామని మంత్రి తెలిపారు. అలాగే రూ.15 లక్షలతో కూలర్లు మరమ్మతులు చేయిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాగంటి పల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బత్తుల బాలిరెడ్డి, బత్తుల బాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరసింహా.. సమరసింహా..!

రాతిదూలం లాగుడు పోటీల్లో ఆర్కే బుల్స్



సమరసింహ వృషభం



యజమాని రామకృష్ణ

చాగలమర్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వీరసింహా... సమరసింహా... ఇవేవో ఫ్యాక్షనిస్టు నేపథ్యం ఉన్న సినిమాలు కావు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన వృషభాల పేర్లు ఇవి. ఆర్‌కే బుల్స్‌గా ప్రాచుర్యం పొందిన ఈ ఎద్దులు బలప్రదర్శన పోటీల్లో దిగితే విజయం వరించాల్సిందే. చాగలమర్రి మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో మంగళవారం రాష్ట్రస్థాయి న్యూ క్యాటగిరీ రాతిదూలం లాగుడు పోటీలు జరిగాయి. ఈ పోటీలకు బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన రామకృష్ణ తన ఎద్దులు (వీరసింహ, సమరసింహ) తీసుకొచ్చాడు. ఇప్పటి వరకు గత ఐదేళ్లలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో జరిగిన 500 రాతి దూలం పోటీల్లో 300 సార్లు ఈ వృషభాలు విజయం సాధించాయి. వృషభాల యజమాని రామకృష్ణ మాట్లాడుతూ వీరనరసింహాను రూ.8.50 లక్షలు, సమరసింహాను రూ.5.30 లక్షలతో ఐదేళ్ల క్రితం కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటి పోషణకు ప్రతి రోజు రూ.2 వేలు ఖర్చు అవుతోందన్నారు. ప్రైజ్‌మనీ కోసం కాకుండా కేవలం పేరు కోసమే పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.



వీరసింహ వృషభం

మహా నందీశ్వరుడి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

పరిశీలించిన నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్



మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ విశ్వనాథ్

మహానంది, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహానంది శివరాత్రి బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల సమన్వయ కృషితో ఘనంగా నిర్వహించుదామని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ తెలిపారు. మహానందిలోని పోచా విశ్రాంతి భవనంలో మంగళవారం మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రెండో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నంద్యాల ఆర్డీఓ సి. విశ్వనాథ్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సకల సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఆలయ పరిధిలో ఉండే సీసీ కెమెరాలకు అదనంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆలయ దర్శనం కోసం వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లతో పాటు తాగునీరు, ప్రత్యేక విద్యుత్ అలంకరణలతో పాటు జంగిల్ క్లియరెన్స్ పనులను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. అడిషనల్ ఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో భక్తుల భద్రతలో భాగంగా పోలీసు శాఖ తరఫున అదనపు పోలీసు బలగాలతో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల ప్రత్యేకాధికారి రామాంజనేయులు, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ మహమ్మద్‌దౌలా, నంద్యాల ఆర్టీసీ డీఎం గంగాధర్, ట్రాన్స్‌కో రూరల్ ఏడీ సుబ్రమణ్యం, మండల ఏఈ ప్రభాకర్‌రెడ్డి, వైద్యాధికార్లు భగవాన్‌దాస్, వెంకటరెడ్డి, ఎంపీహెచ్ఈఓ ఉసేన్‌రెడ్డి ఆలయ ఏఈఓ యర్రమల్ల మధు, పంచాయతీ కార్యదర్శులు కలువ భాస్కర్, నాగసంజీవరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని అన్నారు. ఉత్సవాల ఏర్పాట్లను నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, ఏఈఓ యర్రమల్ల మధుతో కలసి పరిశీలించారు.

రాయలసీమ వర్సిటీ వీసీగా డాక్టర్ వి.వెంకట బసవరావు



కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతిగా డాక్టర్ వి. వెంకట బసవరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం నూతన ఉపకులపతిగా ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. మంగళగిరికి చెందిన ఆయన రెండు తెలుగురాష్ట్రాల్లోని పలు యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పని చేశారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్‌గా కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తూ గత జూలై 31 పదవీ విరమణ చేశారు.

చెంచుల అభివృద్ధికి రూ.9.12 కోట్లు

- రూ.188 గూడేల్లో 30 వేల మంది నివాసం
- ఆత్మకూరులో నన్నారి యూనిట్ ఏర్పాటు
- ఐటీడీఏ పీవో శివప్రసాద్



మాట్లాడుతున్న శివప్రసాద్

రుద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో 9.12 కోట్లతో చెంచుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు శ్రీశైలం ఐటీడీఏ పీవో శివప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన తుండ్లవాగు రిజర్వాయరు వద్ద ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 48, పల్నాడు జిల్లాలో 51, ప్రకాశం జిల్లాలో 89 చెంచుగూడేలు ఉన్నాయన్నారు. వీటిలో 30వేల జనాభా ఉందని అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఏడు చెంచుగూడేల్లో హరినగరం ఒకటని ఆయన అన్నారు. నంద్యాల జిల్లాలో 8700 జనాభా ఉందని, 2900 కుటుంబాలు ఉన్నాయని అన్నారు. అటవీశాఖ, మత్స్యశాఖ సంయుక్తంతో ఐటీడీఏ మరో 10 చెంచుగూడేల్లో 30వేల చొప్పున చేపపిల్లలు వదులుతామని ఆయన తెలిపారు. వేటపై ఆధారపడకుండా ఉపాధి పనులు యువతకు స్వయంశక్తిపై ఆధారపడేలా యువతకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సున్నిపెంటలో 30 మందికి శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు ఫిబ్రవరిలో పంపిణీ చేస్తామన్నారు. ఆత్మకూరులో రూ.25 లక్షలతో నన్నారి యూనిట్ ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఉసిరి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరో రూ.50 లక్షలతోయంత్రాలు కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. మిర్చి యూనిట్లు కూడా ఏర్పాటు చేస్తున్నామ్నారు. కేంద్ర ప్రభుత్వం సీసీడీపీ నిధులు రూ.6. 16 కోట్లు, స్పెషల్ సెంట్రల్ అటెస్టింగ్ నిధులు రూ.1.96 కోట్లు, మరో కోటి రూపాయలతో చెంచుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో రవీంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో భూ రీసర్వే చేయండి

జాయింట్ కలెక్టరు విష్ణుచరణ్

రుద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండో విడత కొనసాగుతున్న భూ రీసర్వే పనులు రైతుల సమక్షంలోనే చేయాలని జాయింట్ కలెక్టరు విష్ణుచరణ్ అన్నారు. మంగళవారం రుద్రవరం మండలం బీరవోలు గ్రామంలో రెండో విడత కొనసాగుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 29 గ్రామాల్లో రెండో విడత పైలెట్ ప్రాజెక్టుగా భూ రీసర్వే పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వ భూములను తగ్గించకుండా రీసర్వే చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములను నిర్ధారించిన తరువాతనే పట్టాభూముల జోలికి వెళ్లాలన్నారు. కాల్వలకు సేకరించిన భూమిని సమగ్రంగా సర్వే చేయాలన్నారు. రీసర్వేలో తప్పులు జరిగితే.. సంబంధిత అధికారులు, సిబ్బందే బాధ్యులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జునరావు, ఏడీ జయరాజ్, ఇన్‌స్పెక్టరు సర్వేయరు, డివిజనల్ సర్వేయరు చెన్నయ్య, కమ్యూనిటీ సర్వేయరు రమణ, సర్వేయర్లు, వీఆర్వోలు, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీరవోలులో భూ రీసర్వే పనులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టరు



శివరాత్రి బ్రహ్మోత్సవాలకు యాగంటి ముస్తాబు


యాగంటి ఆలయ వ్యూ


యాగంటి బసవన్న


ఆలయ పుష్కరిణి

బనగానపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో చంద్రుడు, టీడీపీ యువ నాయకుడు మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. మార్చి 1వ తేదీ వరకు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ నెల 25న మంగళవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. తొలి రోజు ఉదయం 5 గంటలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, కుంకుమార్చన, సహస్ర నామావళి కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 26న బుధవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 27న గురువారం తెల్లవారు జామున 4.30 గంటలకు ఉమా మహేశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 28న శుక్రవారం నందికోల ఉత్సవం, రథోత్సవం ఉంటాయన్నారు. నంద్యాల వారిచే కోలన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ శనివారం శివదీక్ష విరమణ, పూర్ణాహుతి, నాగవల్లి, వసంతోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, షామియానాలు, తాగునీరు. 24 గంటలు విద్యుత్ సౌకర్యం ఉండేలా అధికారులతో సమన్వయం చేస్తున్నాం. శ్యానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నాం. పెద్ద కోనేరు వద్ద మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వసతి, భక్తులకు అందుబాటులో లడ్డూప్రసాదాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. పోలీసుల సహకారంతో శాంతి భద్రతలకు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తున్నాం

- ఆలయ ఈవో చంద్రుడు


యాగంటి ఉమామహేశ్వరులు


యాగంటి ఆలయ గోపురం

భళా బసవన్నా...

● కోసిగిలో ఘనంగా ఎద్దుల బలప్రదర్శన పోటీలు


రాతిదూలం లాగుతున్న వృషభాలు

కోసిగి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో రేణుకా ఎల్లమ్మ రథోత్సవం సందర్భంగా ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఘనంగా జరుగుతున్నాయి. కోసిగిలోని 3వ వార్డు బుగేని చెరువు సమీపంలో నియోజకవర్గ స్థాయి గిరక (రాతిదూలం లాగుడు) పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాలుగు మండలాల నుంచి సుమారు 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి

● కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్


మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

కోసిగి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కోసిగి సర్కిల్ స్టేషన్ పరిధిలోని కోసిగి, పెద్దకడుబూరు మండలాల్లో నాయకులు ఫ్యాక్షన్‌ను వీడి పిల్లలను చదివించుకుని అభివృద్ధి పథంలో ముందుకు నడవాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం కోసిగి సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ మండలంలో ప్రజలు ఫ్యాక్షన్ వీడి ఇప్పుడిప్పుడే అభివృద్ధిలో కోసిగి నడుస్తుందని, అందులో భాగంగానే సోమవారం జరిగిన కోసిగి రేణుకా ఎల్లమ్మ రథోత్సవం ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరిగిందన్నారు. డీఐజీ వెంట ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ ఉన్నారు.

మార్చి 1 నుంచి గురు వైభవోత్సవాలు

● 2025 అవార్డులకు ప్రముఖుల ఎంపిక ●6న 430వ జన్మదిన వేడుకలు



మంత్రాలయం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి గురుభక్తి ఉత్సవాలు మార్చి ఒకటో తేదీ నుంచి నిర్వహించేందుకు మఠం అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. మార్చి ఒకటో తేదీన 404వ పట్టాభిషేకం, ఆరో తేదీన 430వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, సురేష్‌కోణాపూర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. గురువైభవోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే రాఘవేంద్ర గురు వైభవోత్సవ-2025 అవార్డులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో ప్రముఖులను ఎంపిక చేసినట్లు తెలిపారు. న్యాయ, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక, విద్య, వైద్య, చిత్ర పరిశ్రమ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య పాండిత్యంలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో మద్రాసు, ఉత్తరఖండ్ హైకోర్టు చీఫ్‌జడ్జిలు జస్టిస్ కేఆర్ శ్రీరామ్, నరేంద్ర, మద్రాస్, తెలంగాణ హైకోర్టు జడ్జిలు జస్టిస్ సుబ్రమణియన్, శ్రీసుధ, బెంగుళూరు సీబీఐ కోర్టు జిల్లా జడ్జి హెచ్‌ఏ మోహన్, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, కేంద్ర రైల్వే శాఖమంత్రి వి. సోమన్న, కేంద్ర కార్మిక శాఖమంత్రి శోభకరంద్లాజే, ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖమంత్రి నారా లోకేశ్, దేవదాయ శాఖమంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, కర్ణాటక మైనర్ ఇరిగేషన్ శాఖమంత్రి ఎన్‌ఎస్ బోసురాజు, రాజ్యసభ సభ్యులు లెహర్ సింగ్ సిరోయ, బళ్లారి ఎంపీ తుకారాం, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఏపీ సీఎం సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న ఉన్నారు. వీరితో పాటు టీటీడీ ఈఓ శ్యామలరావు, కర్ణాటక ఎండోమెంట్ కమిషనర్ ఎంవీ వెంకటేష్, కర్నూలు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఏపీ ఇంటెలిజెన్స్ ఎస్పీ పక్కీరప్ప, బళ్లారి ఎస్పీ శోభారాణి, టీటీడీ ఏఈఓ వెంకయ్య చౌదరి, కడప విద్వాన్ ఇంద్రకంటి ప్రసాదశర్మ, బళ్లారి పంచాంగ కర్త ప్రొఫెసర్ గురురాజ్ కులకర్ణి, బెంగుళూరు పూర్ణప్రజ్ఞ విద్వాన్ కేశవాచార్య, పూణే గురురాజ్ కులకర్ణి, ఏపీ బీజేపీరాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, టీటీడీ సభ్యులు నరేష్ కుమార్, బెంగుళూరు డాక్టర్ నాగరాజ్‌శెట్టిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు చేతుల మీదుగా నగదు, ప్రశంస పత్రం, అవార్డు, శేష వస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కరిస్తారు. వచ్చే నెల 1వ తేదీ నుంచీ 6వ తేదీ వరకు యోగీంద్ర కళా మంటపంలో ఈ అవార్డుల ప్రదానం జరుగుతుంది.

ఎన్టీఆర్ సుజల స్రవంతికి కొత్త కళ

● వైసీపీ హయాంలో మూతబడిన పథకం
● రూ.4 లక్షల నిధులతో మరమ్మతులు
● నేడు పథకం పునః ప్రారంభించనున్న మంత్రి బీసీ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ఎట్టకేలకు కొత్త కళ సంతరించుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పథకంపై పగబట్టి కక్ష పూరితంగా మూతబడేలా చేశారు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు శుద్ధ జలం అందక ఫ్లోరైడ్ నీటిని తాగే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాగునీటి పథకాన్ని తిరిగి పునరుద్ధరించడానికి మంత్రి బీసీ జనార్దనరెడ్డి చకచకా చర్యలు చేపట్టారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని తిరిగి ప్రజలకు అంకితం చేయడానికి బుధవారం మంత్రి బీసీ జనార్దనరెడ్డి కొలిమిగుండ్లకు రానున్నాడు. కొలిమిగుండ్ల మండల ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించడమే ప్రధాన ధ్యేయంగా ప్రస్తుత మంత్రి, అప్పటి ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి 2015లో రూ.3.79 కోట్ల నిధులతో సుజల స్రవంతి పథకాన్ని మండల ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. కొలిమిగుండ్లలో 10వేల లీటర్ల సామర్థ్యంతో మదర్ ప్లాంటును ఏర్పాటు చేసి, గ్రామాల్లో మినీ వాటర్ ట్యాంకులకు శుద్ధ జలాన్ని సరఫరా చేశారు. ఇందుకోసం ఆరు ట్యాంకర్ ట్రాక్టర్లు నిరంతరం మదర్ ప్లాంటు నుండి మినీ ట్యాంకులకు నీరు సరఫరా చేసి, ప్రజలను ఆదుకున్నారు. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతిపై పగబట్టింది. ఎలాగైనా ఆ పథకం ఆశయాన్ని నీరుగార్చాలని వైఎస్ఆర్ సుజల స్రవంతి పథకంగా పేరు మార్చారు. అనంతరం ఏడాది కూడా గడవక ముందే ఈ పథకం నడవడానికి కనీస నిధులు కేటాయించకుండా నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో పథకం మూతపడింది. ఫలితంగా 21 గ్రామాల్లో శుద్ధ జలం ప్రజలకు అందకుండా పోయింది. వైసీపీ హయాంలో ప్రజలు అనేక గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటినే తాగాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే మంత్రి బీసీ ఈ పథకం మీద ప్రత్యేక దృష్టి సారించారు. రూ.4 లక్షల నిధులు కేటాయించి, మదర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. సమస్యలను అధిగమించి, తిరిగి శుద్ధ జలం సరఫరాకు చర్యలు తీసుకోవడంతో మంత్రి బీసీ జనార్దనరెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం మంత్రి నాలుగు గ్రామాలకు నీటి సరఫరా ప్రారంభించనున్నారు. త్వరలోనే అన్ని గ్రామాలకు శుద్ధ జలాన్ని సరఫరా చేయనున్నారు.


ప్రారంభానికి సిద్ధమైన ఎన్టీఆర్ సుజల స్రవంతి మదర్ ప్లాంట్


నీటి సరఫరాకు సిద్ధమైన ట్రాక్టర్లు

ఎంతో సంతోషంగా ఉంది



సుజల స్రవంతి పథకం తిరిగి ప్రారంభించడం సంతోషంగా ఉంది. అంకిరెడ్డిపల్లెలో శుద్ధ జలం కొరత దీంతో తీరనుంది.

-రవిప్రకాశ్‌రెడ్డి, అంకిరెడ్డిపల్లె

అన్ని గ్రామాలకు శుద్ధ జలం అందించాలి



అనేక గ్రామాల్లో శుద్ధ జల కేంద్రాలు లేవు. సుజల స్రవంతి నుంచి అన్ని ఊళ్లకు శుద్ధ జలం అందించాలి.

-బోయ రవి, కొలిమిగుండ్ల

రాజకీయ కురువృద్ధుల కలయిక

సుదీర్ఘకాలం తర్వాత కలిసిన మాజీ మంత్రులు కేఈ కృష్ణమూర్తి, ఎస్వీ సుబ్బారెడ్డి


ఎస్వీ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న కేఈ కృష్ణమూర్తి

పత్తికొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ రాజకీయాల్లో కురువృద్ధులు. ఇద్దరూ మంత్రులుగా పనిచేసిన వాళ్లే. ఒకసారి కాదు పలుమార్లు క్యాబినెట్ మంత్రులుగా పనిచేసి రాజకీయ ఉద్ధండులుగా పేరొందారు. వారెవరో కాదు.. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి. జిల్లా రాజకీయాలను శాసించిన ఆ ఇద్దరూ వయోభారంతో ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మంగళవారం పత్తికొండలో ఆ ఇద్దరూ భేటీ కావడం ఆసక్తిగా మారింది. పత్తికొండలో జరుగుతున్న కేఈ మాదన్న స్మారక క్రికెట్ పోటీలను తిలకించేందుకు మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి వచ్చారు. మాజీమంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి పత్తికొండలో కుమార్తె నాగరత్నమ్మ ఇంట్లో ఉన్నట్లు తెలుసుకున్న కృష్ణమూర్తి అక్కడకు వెళ్లారు. ఈ సందర్భంగా రాజకీయ స్మృతులను గుర్తు చేసుకుంటూ సరదాగా మాట్లాడుకున్నారు. ఆరోగ్యం, ఆహారపు అలవాట్ల గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. కేఈ కృష్ణమూర్తి తొలుత ఎన్టీఆర్, తర్వాత చంద్రబాబు నాయుడు క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అదేవిధంగా ఎస్వీ సుబ్బారెడ్డి సైతం చంద్రబాబు సారథ్యంలో మంత్రిగా పనిచేశారు. కేఈ కృష్ణమూర్తి టీడీపీలో ఉండగా, ఎస్వీ సుబ్బారెడ్డి మాత్రం రాజకీయాలకు దూరంగా ఉన్నాడు. ఆయన కుమారుడు ఎస్వీ మోహన్ రెడ్డి ప్రస్తుతం కర్నూలు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు లోబడి తవ్వకాలు

● ఆర్డీఓ భరత్ కుమార్
●బంగారు నిక్షేపాలపై ప్రజాభిప్రాయ సేకరణ

తుగ్గలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బంగారు నిక్షేపాల తవ్వకాలు, శుద్ధి తదితర అంశాల్లో పర్యావరణ పరిక్షణకు లోబడి ఉండాలని ఆర్డీవో డాక్టర్ భరత్ కుమార్ నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం మండల పరిధిలోని మద్దికెర గ్రామ శివారులో జియో మైసూరు కంపెనీ పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ బహిరంగ చర్చా వేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకున్న పగిడిరాయి, బొండ్లవానిపల్లె, జొన్నగిరి తదితర గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. పలువురు రైతులు మాట్లాడుతూ గతంలో ఇచ్చే లీజులు పెంచుతూ పోవాలని, కంపెనీకి భూములు ఇచ్చిన ప్రతి రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న జియో మైసూరు కంపెనీ ఫ్యాక్టరీ బొండ్లవానిపల్లెకు దగ్గరగా ఉందని ఆ గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంతేగాకుండా బంగారు శుద్ధి చేపట్టే క్రమంలో వచ్చే వ్యర్థ పదార్థాలు, సైనేడ్ వంటి విష పదార్థాలు భూగర్భజలాల్లో కలిసిపోయి నీరు కలుషితం కాకుండా చూడాలని కోరారు. స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ కంపెనీ ప్రభుత్వ నిబంధనల మేరకు తవ్వకాలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఈఈఏపీపీసీడీ ఆర్వో పీవీ కిషోర్ రెడ్డి, జేపీఈఈ మునిస్వామి నాయుడు, జియో మైసూరు కంపెనీ డైరెక్టర్లు జడ్ డెవిసీస్, మానస రంజన్ బిశ్వాల్, జనరల్ మేనేజర్ రామ్మోహన్, సోమిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ ఎర్రనాగప్ప, నాయకులు ఈశ్వర్ రెడ్డి, జగన్నాథరెడ్డి, మిద్దె వెంకటేశ్ యాదవ్, రవి యాదవ్, సర్పంచ్‌లు ఓబులేసు, సౌజన్య, నబీ రసూల్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ కుమార్ నాయక్

సామాజిక సేవలో 'జియో మైసూరు కంపెనీ'

ఎండీ హనుమ ప్రసాద్


మాట్లాడుతున్న జియో మైసూరు కంపెనీ ఎండీ హనుమ ప్రసాద్

కంపెనీ ప్రారంభానికి ముందుగానే ఈ ప్రాంతంలో రూ.3 కోట్లకు పైగా ఖర్చు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని జియో మైసూరు కంపెనీ ఎండీ హనుమప్రసాద్ వెల్లడించారు. బంగారు నిక్షేపాల తయారీ పనులు ప్రారంభమైతే వచ్చే లాభంలో కొంత భాగం సమాజ సేవకే వెచ్చిస్తామన్నారు. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరించి, వారి సహకారంతోనే దేశంలోనే మొట్టమొదటి ప్రైవేటుబంగారు నిక్షేపాల ప్రైవేటు ఫ్యాక్టరీని ఇక్కడ నెలకొల్పుతున్నామని అన్నారు. ఫ్యాక్టరీ చుట్టూ 27వేల మొక్కలు నాటామని, భవిష్యత్తులో మరిన్ని మొక్కలు కూడా పెంచుతామన్నారు. బంగారు నిక్షేపాలు తీసి మిగతా వేస్టేజీతో మట్టిపై గ్రీనరీ పెంచుతామన్నారు. 597.82 హెక్టార్లలో బంగారు నిక్షేపాల మైనింగ్ జరుగుతుందని, ఇప్పటికే రూ.320 కోట్లు వెచ్చించామన్నారు. పర్యావరణ పరీరక్షణ కోసం రూ.7.7 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. సైనేడ్ వంటి విష పదార్థాలతో ఎలాంటి హామీ కలగకుండా ఇంటర్నేషనల్ లెవల్‌లో పలు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఏటా 750 కిలోల బంగారు వెలికితీసేలా చర్యలు చేపడతామని, ఆరు నెలల్లో ఫ్యాక్టరీ ప్రారంభం అవుతుందని, స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

అక్రమ ఇసుక దందా..

- మంత్రాలయంలో అడ్డూ అదుపూ లేకుండా అక్రమ రవాణా
- రాత్రి, పగలు తుంగభద్రను తోడేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- ఉచిత ఇసుక పేరుతో అక్రమ సంపాదన



లాడ్జి నిర్మాణానికి డంప్ చేసిన ఇసుక

మంత్రాలయం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. అధికారులు పట్టించుకోక పోవడంతో అధికార పార్టీకి చెందిన నాయకులు అక్రమ సంపాదనే ధ్యేయంగా అక్రమ ఇసుకకు తెర లేపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించాలనే సదుద్దేశంతో ప్రవేశ పెట్టగా.. ఇక్కడ మాత్రం అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో తెలుగు తమ్ముళ్లు ఉచిత ఇసుక పేరుతో లాడ్జీలు, హోటళ్లకు, పెద్ద పెద్ద భవంతులకు నది నుంచి ట్రాక్టర్లతో ఇసుకను తోడేస్తున్నారు. కొంత మంది తెలుగు తమ్ముళ్లు ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని అధికారులను గుప్పిట్లో పెట్టుకుని తమ మాట వినకుంటే టీడీపీ నాయకుల నుంచి ఫోన్లు చేయించి దర్జాగా అక్రమ ఇసుకను తరలిస్తున్నారు. మంత్రాలయంలో ఈ మధ్య కాలంలో దాదాపు 25 నుంచి 30 కొత్త లాడ్జీల నిర్మాణం చేపట్టారు. వీటికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రీచుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరగాల్సి ఉండగా.. అవేమీ పట్టించుకోకుండా పక్కనే ఉన్న తుంగభద్ర నది నుంచి రాత్రి, పగలు అని తేడా లేకుండా భక్తులకు ఇబ్బందులకు గురి చేస్తూ అక్రమ ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. ఒక్కొక్క లాడ్జీ నిర్మాణం వద్ద 15 నుంచి 50 ట్రాక్టర్ల దాకా ఇసుకను డంప్ చేసుకున్నారు. ఇది అక్రమమని తెలిసినా కూడా వారిని అడిగే వారు లేరు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచిత ఇసుకను అందించాలనే ఉద్దేశంతో ఉండగా.. ఇక్కడి నాయకులు మాత్రం సొమ్ము చేసుకునే అక్రమ సంపాదనలో మునిగి తేలుతున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ఎమ్మిగనూరు, కల్లుదేవకుంట, చిలకలడోన, సూగూరు, బూదూరు, మాలపల్లి, మాధవరం, సుంకేశ్వరి, రచ్చుమర్రి గ్రామాలకు సరఫరా చేస్తూ రోజుకు వేల రూపాయలు సంపాదిస్తున్నారు.



తుంగభద్ర నదిలో ఇసుకను తవ్విన ప్రదేశం

● రెండు ట్రాక్టర్లు సీజ్.: సూగూరు గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ రవి, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, వీఆర్వో భీమన్నగౌడు తెలిపారు. రాగసుధ వద్ద ఓ ప్రైవేటు లాడ్జీ నిర్మాణానికి ఎస్‌పీ పుష్కర ఘాట్ నుంచి ఇసుకను తోలుతున్న రజాక్, వెంకటేశ్‌లకు చెందిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని, మరో రెండు ట్రాక్టర్లు తప్పించుకున్నాయని తెలిపారు. రెండు ట్రాక్టర్లకు చెరో రూ.10వేలు జరిమానా విధించారు.

● లాడ్జిలకు అనుమతి ఉంటేనే ఉచిత ఇసుక



మంత్రాలయంలో పేదల ఇళ్లకు, సాధారణ గృహాలకు ఉచిత ఇసుకను తోడుకోవచ్చని, లాడ్జీలకు, హోటళ్లకు, పెద్ద పెద్ద భవనాలకు అనుమతి లేకుండా నది నుంచి ఇసుక తరలిస్తే సీజ్ చేస్తామన్నారు. ఇప్పటికే నదిలో అక్రమ ఇసుకకు పాల్పడే ప్రాంతాలను గుర్తించి నివారించామన్నారు. అక్రమ ఇసుక రవాణా జరగకుండా వీఆర్వోలు, వీఆర్ఏలకు ఆదేశాలు జారీ చేశామని, అక్రమ ఇసుక డంప్‌లను వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

- ఎస్ రవి, మంత్రాలయం, తహసీల్దార్

అక్రమ ఇసుక అని తేలితే.. కేసు నమోదు



తుంగభద్ర నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే రెవెన్యూ అధికారుల సలహాలు, సూచనలతో కేసులు నమోదు చేస్తాము. శనివారం అక్రమంగా లాడ్జీలకు తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్‌కు అప్పగించాం. నదీ తీరంలో అక్రమ ఇసుకకు పాల్పడే వారిపై నిఘా ఉంచాం.

- శివాంజల్, ఎస్ఐ, మంత్రాలయం

కులుమాలలో డెంగీ నమోదు



కులుమాల గ్రామంలో దోమల మందు పిచికారీ

గోనెగండ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో డెంగ్యూ వ్యాధి కేసులు రెండు నెలలుగా పెరుగుతున్నాయి. మంగళవారం కులుమాల గ్రామంలో ఓ మహిళకు డెంగీ వ్యాధి సోకిందని ఆదోని డివిజన్ మలేరియా అధికారి సాయిబాబా తెలిపారు. మంగళవారం కులుమాల గ్రామంలో ఆయన, వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. వీధుల్లో ఉన్న మురుగు నీటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అనారోగ్యంగా ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలని వైద్యసిబ్బంది సూచించారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

రుద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్. కొత్తపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైందని బాధితుడు ఓబన్న మంగళవారం తెలిపారు. విద్యుత్



ఆర్.కొత్తపల్లెలో కాలిపోయిన గుడిసె

- రూ.2 లక్షల నష్టం

షార్ట్‌సర్క్యూట్ వల్ల గుడిసె కాలిపోవడంతో కట్టుబట్టలతో బయటపడ్డామని బాధితులు వాపోయారు. రూ.80 వేల నగదు, వంటపాత్రలు, ధాన్యం, ఇతర వస్తువులు, బీరువా, టీవీ, ఫ్యాన్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

బీవీఆర్ యూట్యూబర్‌ది హత్యే..



తిరుమల్ రెడ్డి (ఫైల్)

మద్దికెర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ యూట్యూబర్ బి. తిరుమల్ రెడ్డి హంద్రీ నీవా కాలువలో మృతదేహం మంగళవారం లభ్యం కావడంతో ఇది హత్యే అని తేలిపోయింది. మద్దికెర గ్రామానికి చెందిన తిరుమ ల్‌రెడ్డి గుంతకల్లులోని తిలక్‌నగర్‌లో కాపురముంటూ యూట్యూబ్ చానల్ నడుపుతున్నాడు. అయితే.. ఈ నెల 17న బుగ్గ సమీపంలోని తన తోటకు ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. తర్వాత మాయమయ్యాడు.. మంగళవారం మధ్యాహ్నం కసాపురం వద్ద గల హంద్రీనీవా కాలువ వద్ద ఆయన శవం కనిపించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని కసాపురం పోలీసులు పత్తికొండకు తరలించారు. దీంతో ఇది హత్యే అని తేలింది. బుగ్గ సంగాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో తిరుమల్‌రెడ్డి పది రోజుల క్రితం గొడవ పడినట్లు ఆయన భార్య కామేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఆ వ్యక్తే హత్య చేయించి కాలువలో పడేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



చరణ్ (ఫైల్)

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం బిళ్లలాపురం గ్రామానికి చెందిన చరణ్ (24) ప్రమాదవశాత్తూ పట్టణ శివారులోని చిన్న చెరువులో పడి మృతిచెందినట్లు తాలుకా అర్బన్ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. డిగ్రీ వరకు చదువుకున్న చరణ్ ఉద్యోగం రాకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇంట్లో తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఆదివారం స్నేహితులతో కలిసి చిన్న చెరువుకు వచ్చాడు. స్నేహితులందరూ ఊరికి బయల్దేరగా కాసేపు ఉండి వస్తానని చెప్పడంతో వారందరూ ఊరికి వెళ్లిపోయారు. స్నానం చేసేం దుకు చెరువులోకి దిగిన చరణ్ నీటి లోతును పసిగట్టలేక ఈతరాకపోవడంతో పూడికలో కూరుకుపోయి మృతిచెందినట్లు సీఐ తెలిపారు. సోమవారం మృతదేహం చెరువులో కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహన్ని వెలికితీసిన పోలీసులు బిళ్లలాపురానికి చెందిన చరణ్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల సర్వజన వైద్యశాలకు తరలించారు. యువకుడి తండ్రి బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ఓర్వకల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై సోమయాజులపల్లె-బేతంచెర్ల క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన సున్నంవలి, భార్య మహబూబ్‌బీ కర్నూలులో పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. అయితే వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీకొని మహబూబ్ బీ (45) తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భర్త సున్నంవలికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టరు కింద పడి వ్యక్తి..

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సంజామల మండలం నట్లకొత్తూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి (37) అనే వ్యక్తి కోవెలకుంట్లలో ట్రాక్టర్ కింద పడి మంగళవారం మృతి చెందాడు. కుందూ నుంచి ట్రాక్టర్‌లో గ్రావెల్ తీసుకొని కోవెలకుంట్లకు వచ్చాడు. అయితే వెంకటసుబ్బారెడ్డి ట్రాక్టర్ డోర్ తెరుస్తుండగా డ్రైవర్ సయ్యద్ ఒక్కసారి ట్రాక్టర్‌ను రివర్స్ చేయడంతో వెంకటసుబ్బరెడ్డి ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటనాస్థలానికి వివరాలు సేకరించారు. మృతుడి బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నక్షాతో భూములకు శాశ్వత రక్ష



డ్రోన్ ఫ్లయింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్, డైరెక్టర్

- ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కమిషనర్ రవీంద్రబాబు
- పైలెట్ ప్రాజెక్టుల్లో కర్నూలు ఎంపిక కావడంపై హర్షం

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రభుత్వం, ప్రైవేటు భూములకు, కేంద్ర ప్రభుత్వం జియోస్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్(ఎన్‌ఏకేఎస్‌హెచ్‌ఏ-నక్షా) కార్యక్రమం శాశ్వత రక్ష ఇస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్, ఉమ్మడి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సమన్వయకర్త బిసి. ఫరిదా అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో సచివాలయ అడ్మిన్లు, ప్లానింగ్, వీఆర్‌ఓ కార్యర్శులతో నక్షా కార్యక్రమ ప్రారంభోత్సవ సభను నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నక్షా కార్యక్రమ లక్ష్యం, అమలు ప్రక్రియ, పనితీరు, ఫలితాలు వంటి వివరాలను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా సర్వే ఆఫ్ ఇండియా, డ్రోన్ ఫ్లయింగ్ ఏజెన్సీ ప్రతినిధులు అవగాహన కల్పించారు. నక్షా పోస్టులను ఆవిష్కరించిన అనంతరం సమావేశ భవనం పైనుంచి ఎమ్మెల్యే, కమిషనర్ డ్రోన్ ఫ్లయింగ్ తిలకించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో భూములకు సంబంధించి సమస్యలు, సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నా యన్నారు. నక్షా కార్యక్రమం దిగ్విజయంగా పూర్తైతే, శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డిజిటల్ ఇండియా భూ రికార్డుల డిజిటలీకరణ కార్యక్రమం(డీఐఎల్‌ఆర్ఎంపి)లో భాగంగా నక్షా కార్యక్రమాన్ని రూపకల్పన చేసిందన్నారు. నగర పరిధి 114 స్క్వేర్ కిలోమీటర్లు ఉందని, పైలెట్ ప్రాజెక్ట్ కింద తొలి దశగా ఏడాది కాలంలో 49 స్క్వేర్ కిలోమీటర్ల భూమిలో సర్వే పూర్తి అవుతుందన్నారు. వివాద రహిత శాశ్వతమైన ల్యాండ్ రికార్డు ఏర్పాటుకు నగర ప్రజలంతా సహకరించాలని కమిషనర్ కోరారు. సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నక్షా కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా దేశ వ్యాప్తంగా 152 పట్టణాలను ఎంపిక చేయగా ఏపీలో ఏడు జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్వెల్ జియోస్పేషియల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు కే. రవి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌వో జునైద్, సూపరింటెండెంట్ సుబ్బన్న, టీపీఎస్ అంజాద్‌బాషా, సిబ్బంది అనంత వెంకటేష్, భార్గవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రోగ నిర్ధారణ పరీక్షలను బయటకు పంపితే చర్యలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

- నర్సింగ్ సేవలు మరింత మెరుగుపడాలి
- జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

కర్నూలు హస్పిటల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోగ నిర్ధారణ పరీక్షలను బయటకు పంపితే కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం ధన్వంతరీ హాలులో హెడ్ నర్సులు, వార్డు ఇన్‌చార్జిలతో సీఎస్ఆర్ఎంవో డా.బి. వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధూ సుబ్రహ్మణ్యంతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి నర్సింగ్ సేవలు ఎంతో కీలకమన్నారు. నర్సింగ్ సేవలను మరింతగా మెరుగుపరుచుకోవాలని, ఆసుపత్రిలో పలు విభాగాల్లో ఉండే హెడ్ నర్సులు, ప్రతి రోజు విభాగాల్లో డాక్టర్లతో పాటు రౌండ్స్‌లో పాల్గొనాలని ఆదేశించారు. ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వో, పారిశుధ్య కార్మికులు, రోగుల నుంచి డబ్బులు అడిగితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్షలో నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 ఎస్‌పీ సావిత్రీబాయి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి. విమలమ్మ పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మంగళవారం ఓ కేసు విషయంలో వాగ్మూలం ఇవ్వడానికి ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జీ కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసు మార్చి 27వ తేదీకి వాయిదా పడింది. అనంతరం కోర్టుకు వచ్చిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని బార్ అసోసియేషన్ సభ్యులు కలిసి అడిషనల్, సబ్ కోర్టుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురురాజారావు, రఘురామ్, న్యాయవాదులు వెంకటేశ్వరరెడ్డి, రషీద్ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఐజీ

కౌతాళం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కౌతాళం పోలీసు స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే స్టేషన్‌ను తనిఖీ చేశానని స్టేషన్‌లో కేసుల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల పోలీసులు మర్యాదగా నడుచుకోవాలని తెలిపారు. వీరి వెంట ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, కౌతాళం సీఐ అశోక్ కుమార్ ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ ప్రవీణ్

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



ఖైదీల ఆహారాన్ని పరిశీలిస్తున్న లీలా వెంకట శేషాద్రి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకుని మంచి పౌరులుగా మారాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఖైదీలకు సూచించారు. స్థానిక పంచలింగాలలోని జిల్లా జైలును ఆ తర్వాత నగరంలోని మహిళా జైలును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన నేరాలను మరిచిపోయి సమాజంలో మంచి పౌరులుగా మారడానికి శిక్షా కాలాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఖైదీలకు న్యాయ లీగల్ ఎయిడ్ క్లీనిక్‌లను ఏర్పాటు చేశారని, అందులో ఓ అడ్వకేట్, ఓ పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారి ద్వారా ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు.ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు హెల్ప్‌లైన్ నెంబర్.15100 సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

దామోదరం జిల్లాగా ప్రకటించాలి



పెద్దపాడులో సంజీవయ్య ఇంటి వద్ద గ్రామస్థులతో రామకృష్ణ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కల్లూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతిశ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసిన నిరాడంబర, మాజీ సీఎం దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు నామకరణం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. అదేవిధంగా హంద్రీనది ఒడ్డున సంజీవయ్య స్మారకస్థూపం, విజ్ఞానకేంద్రం ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. మంగళవారం సంజీవయ్య స్వగ్రామం పెద్దపాడులో ఆయన నివసించిన ఇంటిని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి సంజీవయ్య జీవితం గురించి తెలుసుకున్నారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన ఆదర్శమూర్తి సంజీవయ్య అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సంజీవయ్య రెండేళ్ల స్వల్పకాలం పదవిలో ఉన్నా వినూత్న పథకాలతో ప్రజా సంక్షేమానికి పాటుపడ్డారని తెలిపారు. పెద్దపాడు గ్రామంలో సంజీవయ్య పేరిట కమ్యూనిటీహాల్ నిర్మించాలని, జీవిత చరిత్రను పాఠ్య పుస్తకంగా తీసుకురావాలని డిమాండ్ చేశారు. 105 జయంతి నాటికి డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు లేఖ రాస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, నాయకులు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారం జరిగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 45 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 1513 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 1495 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 45 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 1390 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 1368 మంది పరీక్షకు హాజరయ్యారు. ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి, స్క్వాడ్ బృందాలు తదితరులు పర్యవేక్షించారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

కొత్తూరులో డోన్ ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే కోట్ల దంపతులకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

పాణ్యం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు షష్టి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఎమ్మెల్యే కోట్ల దంపతులకు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగలింగేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో కోట్ల దంపతులకు పూలమాలలు, శాలువాలు, శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదం అందజేశారు. పాణ్యం, బేతంచెర్ల ఎస్‌ఐలు నరేంద్రకుమార్ రెడ్డి, రమేష్, ఏఎస్‌ఐ రఫి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు రోహిత్ శర్మ, సుబ్బయ్య స్వామి, కృష్ణయ్యస్వామి, టీడీపీ నాయకుడు మిలిటరీ సుబ్బారెడ్డి ఉన్నారు.

గౌరవ వేతనం విడుదలపై హర్షం

ఆత్మకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజమ్‌లకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ తరపున రూ.45 కోట్ల గౌరవ వేతనాలను విడుదల చేయడం పట్ల ఆత్మకూరు మసీద్ మతవల్లిల సంఘం అధ్యక్షుడు నూర్‌బేగ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 2016లో తొలి సారిగా మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజమ్‌లకు వేతనాలను సీఎం చంద్రబాబే ప్రారంభించినట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మసీద్‌ల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజమ్‌లకు రూ.45కోట్ల గౌరవ వేతనాల నిధులను విడుదల సంతోషకరమని అన్నారు. ఇందుకు చొరవ తీసుకుని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీశైల నియోజకవర్గంలోని మొత్తం 160 మసీద్‌లకు సంబంధించి ఒక్కో మసీద్‌కు రూ.15వేల చొప్పున ఆరు నెలల గౌరవ వేతనాలు మంజూరైనట్లు వెల్లడించారు.

నిలిచిన నీటి సరఫరా



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్లను మూసివేసిన దృశ్యం

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి దిగువకు ఎస్సార్బీసీ కాలువలోకి నీటి విడుదలను మంగళవారం అధికారులు పూర్తిగా బందు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కృష్ణానది జలాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో ఉన్నతాధికాల మేరకు గేటునుంచి చుక్కనీరు పోకుండా సరఫరాను నిలిపివేసినట్లు నీటిపారుదలశాఖ ఈఈ పార్థసారధి తెలిపారు. గతేడాది జూలై 27న శ్రీశైలం జలాశయం వెనుకజలాలను పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటిని ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీటి అవసరాలకు దిగువకు విడుదల చేశారు. 6 నెలల 20 రోజుల పాటు రాయలసీమ జిల్లాలు కర్నూలు, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో ఉన్న జలాశాలలను నింపటంతో పాటు, చెన్నైకి 15 టీఎంసీల కలిపి దాదాపు 210 టీఎంసీలను పోతిరెడ్డిపాడునుంచి విడుదల చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రీశైల జలాశయం నీటిమట్టం 850 అడుగులమేర కొనసాగుతోంది. వెయ్యి నుంచి రెండువేల క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు నుంచి విడుదల తీసుకోవడానికి అవకాశం ఉన్నా డ్రాచేసుకోలేని పరిస్థితి నెలకొంది.

'యూరియాను బ్లాక్‌లో విక్రయించారు'

పాణ్యం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండలానికి వచ్చిన యూరియా బస్తాలను బ్లాక్‌లో విక్రయించారని ఎంపీటీసీ రంగరమేష్, మాజీ ఎంపీటీసీ రామగోవిందరెడ్డి ఆరోపించారు. మంగళవారం వారు మాట్లా డుతూ మంగళవారం రెండు లారీల లోడు యూరియా వచ్చిందని, అయితే పాణ్యంలోని రైతులకు ఇవ్వకుండా బ్లాక్‌లో అమ్ముకున్నారని ఆరోపించారు. ఏవో జయప్రకాష్‌రెడ్డిని వివరణ కోరగా పాణ్యంలోని 3, 4 సచివాలయాలకు ఒక్కొక్క సచివాలయానికి 266 బస్తాలు వచ్చాయన్నారు. ఆలమూరులో ఇద్దరు రైతులకు 20 బస్తాలు పంపిణీ చేశామన్నారు. చిలకల, పాణ్యం గ్రామాలలోని రైతులకు మొత్తం యూరియా పంపిణీ చేశామన్నారు. డీలర్లకు ఇవ్వలేదని, రైతులకే నేరుగా పంపిణీ చేశామన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు ప్రారంభమైన శిక్షణ

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న తనంలోనే పిల్లల్లో పటిష్టమైన పునాది వేసేందుకే శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ లీలావతిదేవి అన్నారు. మంగళవారం బండిఆత్మకూరు హైస్కూల్‌లో ఆరు రోజుల పాటు అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించే శిక్షణను పీడీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుత మూడు సంవత్సరాల నుంచి ఎనిమిది సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యలో పటిష్టమైన పునాది వేసేందుకే ఆరు రజుల శిక్షణ ఉపాధ్యాయుల చేత అంగన్‌వాడీ టీచర్లుకు అందిస్తున్నామన్నారు. ఈ శిక్షణను ప్రతి ఒక్కరూ ఆరు రోజులపాటు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, శిక్షకులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

నందికొట్కూరు: అంగన్‌వాడీ టీచర్లు ఆడుతూ పాడుతూ పిల్లలతో మమేకం కావాలని నందికొట్కూరు ఎంఈవో సుభాన్ సూచించారు. మంగళవారం ప్రభుత్వ బాలికలున్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి 15 రోజుల శిక్షలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 72 మంది అంగన్వాడీ టీచర్లకు కోర్సు డైరెక్టర్ , నందికొట్కూరు ఎంఈవో సుభాన్ శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పార్వతి, ఆర్పీలు వేణుమాధవరావు, రామకృష్ణయ్య అనూరాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఆశీర్వదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: అంగన్‌వాడీ కేంద్రాలలో చదువు తున్న ఆరు ఏళ్లలోపు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించేలా చూడాలని ఎంపీడీవో దశరథరామయ్య సూచించారు. మంగళ వారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్త లకు మూడు రోజులపాటు శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో ఫైజున్నీసా, ఎంఈవో- 2 శ్రీనాథ్, కళశాల ప్రిన్సిపాల్ సలీం బాషా పాల్గొన్నారు.

బ్యాంకర్లు లక్ష్యాలను పూర్తి చేయాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు కేటాయించిన రుణ మంజూరు లక్ష్యాలను మార్చి 15లోపు వందశాతం పూర్తిచేయాలని కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రభుత్వ పథకాల రుణ మంజూరుపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ సుబ్బారెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్, స్టేట్‌బ్యాంక్ రీజినల్ మేనేజర్ సూర్యప్రకాష్‌తోపాటు వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రుణాల మంజూరులో కొంతమేర ప్రగతి సాధించారని, పెండింగ్ లక్ష్యాలను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం, పీఎం సూర్యఘర్, స్టాండ్ అప్ ఇండియా, పీఎంఈజీపీ, ముద్రా లోన్స్ తదితర పథకాలకు రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నారని, వాటిని కూడా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల శ్రేయస్సుకు ప్రభుత్వం మంజూరుచేసిన రుణాలు అందించి తోడ్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నాబార్డు ద్వారా 2025-26కు సంబంధించి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ కింద రూ.11,972కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

'అత్యవసర చికిత్సలకు రక్తం అందుబాటులో ఉంచుతాం'

నంద్యాల మున్సిపాలిటీ: నంద్యాల జిల్లా కేంద్రానికి అత్యవసర వైద్య చికిత్సల కోసం వచ్చే రోగులకు రక్తం అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మంగళవారం చిన్న నీటి పారుదల శాఖ సముదాయంలో అవసరమైన రక్త నిల్వ కేంద్ర భవనాన్ని పరిశీలించారు. భవన ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ పర్ల దస్తగిరి, కోశాధికారి నాగేశ్వర రావు, వైస్ ఛైర్మన్ మారుతి కుమార్, కార్యవర్గ సభ్యుడు ఉస్మాన్ బాషా, చిన్ని నీటి పారుదలశాఖ ఈఈ రఘురామి రెడ్డి, మున్సిపల్ ఏఈ శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

● అధికారుల గైర్హాజరుపై ఎమ్మెల్యే జయసూర్య ఆగ్రహం



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే జయసూర్య అధికారులకు సూచించారు. మంగళవారం నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో అధికారులు పూర్తి స్థాయిలో పాల్గొనడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని అన్నారు. గ్రామాలలో పారిశుధ్య పనులు, విద్యుత్, తాగునీటి సమస్యలపై దృష్టి సారించి సమస్యలు లేకుండగా చూడాలన్నారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించి అంగన్‌వాడీ కేంద్రాలు అందులో కొనసాగేలా చూస్తామన్నారు. పశు వైద్యులు గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలోని సమస్యలను పరిశీలించకుండా కేవలం సచివాలయానికే సిబ్బంది పరిమితం కావడం చాలా విడ్డూరమన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నందికొట్కూరులోని తాలుకా ఆఫీస్ రోడ్డులో పాఠశాల సమీపంలో వ్యాపార సముదాయాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలని ప్రజలు కోరారు. సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జయసూర్యకు వినతి పత్రం అందజేశారు.

ఖాళీ స్థలం లీజుకు బహిరంగ వేలం

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానంలోని ఖాళీ స్థలం లీజుకు ఇవ్వడానికి మంగళవారం దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో ప్రథమ నందీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ టెండరు ప్రక్రియను ఇ-టెండర్, సీల్డ్ కొటేషన్ కమ్ బహిరంగవేలం ద్వారా నిర్వహించారు. ముందుగా బహిరంగ వేలం ద్వారా ఎగ్జిబిషన్ శ్రీనివాసులు మూలసాగరం గ్రామంలోని 453 సర్వే నెంబరులోని 3 ఎకరాల ఖాళీ స్థలాన్ని 11ఏళ్ల పాటు ఏడాదికి రూ.6,20,000లకు టెండరు పాడారు. రెండవ ప్రక్రియ ద్వారా టెండర్ బాక్స్ ద్వారా శ్రీనివాసులు అనేవ్యక్తి రూ.5,40,000 లకు షీల్డ్ కొటేషన్ టెండర్ బాక్స్‌లో వేశారు. మూడో ప్రక్రియ ద్వారా అనగా ఇ- టెండర్ ద్వారా ఎవరూ వేయలేదు. అందువల్ల ఆలయ అధికారులు చివరిగా వేలంపాటద్వారా ఎక్కువ మొత్తానికి వేలంపాట పాడిన ఎగ్జిబిషన్ శ్రీనివాసులుకు సంవత్సరానికి అద్దె రూ.6,20,000లకు టెండరు ఖరారు చేశారు. మూడు సంవత్సరాల కొకసారి 10శాతం పెంచుతూ ఇలా పదకొండు సంవత్సరాల కాలం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎండోమెంట్ జిల్లా అధికారి మోహన్, కర్నూలు జిల్లా దేవదాయశాఖ సూపరిండెంట్ తిరుమల్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, ఆలయ ఈవో రామానుజం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవోలు చంద్రుడు, వేణునాథరెడ్డి, గోపి, అర్చకులు ప్రవీణ్‌కుమార్, ఆలయ సిబ్బంది, వేలందారులు పాల్గొన్నారు.

'నాణ్యత పాటించాలి'



కొక్కెరంచలో సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డీఈ

కొత్తపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని, లేకపోతే బిల్లులు నిలిపివేస్తామని క్వాలిటీ కంట్రోలర్ డీఈ రవీంద్ర రెడ్డి కాంట్రాక్టర్లను హెచ్చరించారు. మండలంలోని కొక్కెరంచ, నాగంపల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను మంగళవారం ఆయనతో పాటు ఆ శాఖ ఏఈ అమర్నాథ్, పీఆర్ఏఈ మద్దిలేటితో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలో సుమారు రూ.3 కోట్ల మేర ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలను పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కొక్కెరంచ, నాగంపల్లి గ్రామాల్లో రూ.37.50 లక్షలతో నిర్మించిన 7 సీసీ రోడ్ల పనుల నాణ్యతను పరిశీలించామని చెప్పారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సాగర్, ఆలీబాషా, వీఆర్వో వేణుగోపాల్ ఉన్నారు.

నేటి నుంచి అన్నదానం

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్ళే పాద యాత్రికుల కోసం నేటి నుండి శివరాత్రి పర్వదినం వరకు రాజరాజేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో రెండు చోట్ల అన్నదాన శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ భక్త బృందం సభ్యులు మంగళవారం తెలిపారు. శ్రీశైల ముఖద్వార క్షేత్రంగా భాసిల్లుతున్న వెంకటాపురం గ్రామంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత 27 సంవత్సరాల నుంచి ఇక్కడ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కాగా ఈ ఏడాది వెంకటాపురం గ్రామస్థులు, దాతల సహకారంతో రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో సైతం గ్రామంలో రెండు చోట్ల అన్నదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 25 వరకు ఈ అన్నదాన శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. అలాగే నల్లమల అభయారణ్యంలోని నాగలూటి క్షేత్రంలో బుధవారం నుంచి ఫిబ్రవరి 25వ తేది వరకు పెద్ద దేవళాపురం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గత 31 సంవత్సరాల నుండి ఇక్కడ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నంద్యాల మున్సిపల్ సహాయ కమిషనర్‌గా వెంకటదాసు

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ సహాయ కమిషనర్‌గా డి. వెంకటదాసు మళ్లీ బదిలీ అయ్యారు. వెంకటదాసు ఏడాది క్రితం నంద్యాల మున్సిపల్ సహాయ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నంద్యాల నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. అక్కడ ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా ఏడాది పాటు విధులు నిర్వహించారు. వెంకటదాస్ బదిలీ అనంతరం నంద్యాలలో మున్సిపల్ సహాయ కమిషనర్ పోస్టు ఖాళీగానే ఉంది. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ శాఖ ఆ శాఖలో పనిచేస్తున్న 8 మందికి పదోన్నతి కల్పిస్తూ 27-01-2025న జీవో నెంబరు 13 విడుదల చేసింది. ఈ మేరకు వెంకటదాస్‌కు గ్రేడ్-2 పదోన్నతి కల్పించింది. పదోన్నతిలో భాగంగా తాను నంద్యాల మున్సిపల్ సహాయ కమిషనర్‌గా వారం రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఫోన్‌లో ఆంధ్రజ్యోతికి తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

పాణ్యం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బ్రిటీష్ కౌన్సిల్ ఇంగ్లీష్ సర్టిఫికెట్ కోర్సుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రిటీష్ కౌన్సిల్ వ్యూహాత్మక ప్రణాళికల అధిపతి బార్లేస్ట్ ప్రోకోప్ విద్యార్థులకు ఇంగ్లీష్ స్కోర్ టెస్టింగ్ ప్లాట్‌ఫాంపై విలువైన సూచనలు అందించారు. కార్యక్రమంలో శైలజ పాల్గొన్నారు.

అయ్యలూరులో పారిశుధ్య పనులు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యలూరు గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. మూడు రోజుల క్రింత కలెక్టర్ రాజకుమారి గాజులపల్లె నుంచి వస్తూ అయ్యాలూరు గ్రామం మీదుగా వెళుతున్న జాతీయ రహదారి అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి గ్రామ కార్యదర్శితో పాటు సరస్వతి పాత సిబ్బందిని మందలించారు. దీంతో కార్యదర్శి సురేంద్ర, సర్పంచ్ ఓబులేసు హుటాహుటిన జాతీయరహదారి మీద చెత్త చెదారాన్ని శుభ్రం చేశారు. రహదారి మీద ఉన్న మట్టి కుప్పలను చదును చేసి రోడ్డుకు ఇరువైపులా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. మూడు రోజులుగా జరుగుతున్న పంచాయతీ పనులతో గ్రామం మీద వెళ్లుతున్న జాతీయ రహదారి పరిశుభ్రంగా తయరైంది. కలెక్టర్ ఆదేశాలతో పారిశుద్యం మెరుగుపడి, ప్రయాణానికి ఇబ్బందిగా ఉన్నమట్టికుప్పలు సైతం రహదారిగా మారాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

'సద్వినియోగం చేసుకోవాలి'



జాబ్‌మేళాలో పాల్గొన్న నిరుద్యోగులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సూచించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాకు మొత్తం 104 మంది అభ్యర్థులు రాగా వారిలో 43 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాసాగర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న ఉన్నారు.

'లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు'

పాణ్యం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవని నంద్యాల దిశ పోలీసు స్టేషన్ సీఐ రమేష్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మోడల్ స్కూల్, కేజీబీవీ విద్యార్థులకు లైంగిక వేధింపులు, గృహహింస, బాలికల పట్ల వేధిపుల నివారణపై అవగాహన కల్పించారు. ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దేవదానం మాట్లాడుతూ మానసిక వేధింపులకు గురైన మహిళలకు న్యాయం చేసేలా దిశ పోలీసులు, 112 నెంబరు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి: డీఏవో



పాములపాడులో మాట్లాడుతున్న డీఏవో మురళీకృష్ణ

పాములపాడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో ఏపీ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని నంద్యాల డీఏవో మురళీకృష్ణ సూచించారు. మంగళవారం పాములపాడు, చెలిమిళ్ల గ్రామలలో నిర్వహిస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆత్మకూరు డీఏవోతో పాటు ఏడీఏ అంజనేయ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతులు విశిష్ట సంఖ్య నమోదు కోసం ప్రతి రైతు పట్టదారు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఏవో ఫణీశ్వరరెడ్డి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: పంట మార్పిడితో అధిక దిగుబడి సాధ్యమని డీఏవో మురళీకృష్ణ రైతులకు సూచించారు. మంగళవారం కొత్తపల్లిలోని రైతు సేవా కేంద్రంలో సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన ఏవో మహేష్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ ఆంజనేయ, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, డీటీ పెద్దన్న, పశువైద్యాధికారి భువనేశ్వరి, నాయకులు వెంకటస్వామి గౌడు, శివరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి నాగశ్రీ, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

'అధిక ధరకు విక్రయిస్తే చర్యలు'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణదారులు యూరియాను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో స్వాతి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సంతజూటూరు గ్రామంలో పలు ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ప్రతి రైతుకు విధిగా బిల్లు అందజేయాలని, నాణ్యమైన ఎరువులు విక్రయించాలని ఆదేశించాన్నారు.

గోస్పాడు: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏవో స్వప్నిక హెచ్చరించారు. మంగళవారం జిల్లెలలోని సాయికృష్ణా ఏజెన్సీస్, వెంకటసాయిలక్ష్మి పెర్టిలైజర్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

'క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం'

ఆత్మకూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ సూచించారు. క్షయవ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జడ్పీ హైస్కూల్‌లో క్షయవ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. హెచ్‌ఎం షహనాజ్ ఉన్నిసా, సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ జబీవుల్లా తదితరులు ఉన్నారు.

'పట్టణాల్లోనూ ఉపాధి కల్పించాలి'

నంద్యాల రూరల్ ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని, పట్టణాల్లోనూ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ కోరారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో మంగళవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజన సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని, సామాన్యులపై ధరల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. జీడీపీలో ఆరోగ్యానికి 3శాతం, విద్యారంగానికి 6 శాతం కేటాయింపుపెంచాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, మండల కార్యదర్శి బాలవెంకట్, మహమ్మద్‌గౌస్, తోటమద్దులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'



సమస్యలు తెలుసుకుంటున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఎళ్లవేళలా అందుబాటులో ఉంటామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. పట్టణంలోని 28 వార్డు ప్రజల విజ్ఞప్తి మేరకు ఫిరోజ్ మంగళవారం ఆ వార్డును పరిశీలించారు. ఆయన ఘనీకృత వీర్య కేంద్రం నిర్మిస్తున్న ప్రహరీని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, టీడీపీ స్థానిక వార్డు ఇన్‌చార్జి కృపాకర్, 33వ వార్డు ఇన్‌చార్జి జోసఫ్, బూత్ ఇన్‌చార్జి జేమ్స్ తదితరులు ఉన్నారు.

● పట్టణంలోని రోజా కుంట వీధిలో ఆటో మోబైల్, ఆయిల్ అసోసియన్ కార్యాలయం బుధవారం ప్రారంభమైంది. అసోసియేషన్ కార్యాలయాన్ని టీడీపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కబీర్ అహ్మద్, వార్డు ఇన్‌చార్జి జాకీర్ హుసేన్, ఉపాధ్యక్షుడు ఆనంద్, కార్యదర్శి అబ్దుల్ అజీజ్, కోశాధికారి వెంకటరమణ రావు, న్యాయవాది ఖలీల్ పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ. 5.15 లక్షల ఆదాయం

మహానంది, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే పరిసరాల్లోని టీటీడీ కల్యాణ మంటపం వద్ద నిర్వహించే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసుకొనేందుకు నిర్వహించిన బహిరంగ వేలాల ద్వారా దేవస్థానానికి రూ.5.15 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గోపవరానికి చెందిన చంద్రుడు రూ.5.15 లక్షలకు అధికంగా వేలంలో పాట పాడుకొని ఎగ్జిబిషన్‌ను కైవసం చేసుకొన్నట్లు ఈవో చెప్పారు. ఏఈవో యర్రమల్ల మధు, పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్‌వో



బాలింతను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

వెలుగోడు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. మోతుకూరు గ్రామంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, గదు లను, సౌకర్యాలను పరిశీలించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వా సుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా, మాత శిశు మరణాలను లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి సమస్యలను, సేవలను, పలు అంశాల గురించి తెలుసుకున్నారు. వైద్యాధికారి సుధాప్రణీత, సీహెచ్‌వో నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి: డీడీఏ

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పంట సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధ్యమని డీడీఏ చెన్నయ్య అన్నారు. మంగళవారం నంద్యాల మండలంలోని అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మినుము, వరి పంటలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏడీఏ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన

పాణ్యం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం పాణ్యం పోస్టల్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ప్రైవేటీకరణను నిలిపి వేయాలని, టార్గెట్ల పేరుతో ఉద్యోగులను హింసించకూడదని పోస్టుమ్యాన్ శేఖర్ అన్నారు. సిబ్బంది మహిత, ఫయాజ్ బాషా, షాహింషా, ప్రియాంక, గంగా, సత్యస్వరూప పాల్గొన్నారు.

షేక్షావలిరెడ్డికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న షేక్షావలిరెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి సుచిర్ ఇండియా ఫౌండేషన్ నుంచి ఉత్తమ ఛాత్రాలయ పురస్కారాన్ని పొందారు. హైదరాబాద్‌లోని లలిత కళాతోరణం పబ్లిక్ గార్డెన్ నిర్వహించిన సుచిర్ ఇండియా అవార్డు ప్రదానోత్సవంలో వరుసగా రెండోసారి ఉత్తమ డెరెక్టర్‌గా తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ప్రముఖ సినీ నటులు రావురమేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఉత్తమ విద్యా ప్రమాణాలు పాటిస్తూ విద్యనందిస్తున్న యాజమాన్యానికి ఈ అవార్డులు సుచిర్ ఇండియా ఫౌండేషన్ అందజేస్తోంది.

సభను విజయవంతం చేయండి

డోన్ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో 23న జరిగే సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు రంగనాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద సభకు సంబంధించిన గోడప త్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో దొరపల్లె రాజు, శ్రీరాములు, లక్ష్మన్న, బాలమద్ది పాల్గొన్నారు.

గ్యాస్‌ను పొదుపుగా వాడుకోవాలి

డోన్ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్యాస్‌ను వినియోగదారులు పొదుపుగా వాడుకోవాలని అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా, భారత్ గ్యాస్, విజయ గ్యాస్ నిర్వాహకులు అన్నారు. మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మహిళలకు గ్యాస్ వినియోగంపై అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. గ్యాస్ స్టవ్‌లో చిన్న బర్నర్ వినియోగిస్తే పది శాతం గ్యాస్ ఆదా అవుతుందన్నారు. వంటలు చేసిన అనంతరం గ్యాస్ రెగ్యులేటర్ తప్పనిసరిగా ఆఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో భారత్ గ్యాస్, విజయ గ్యాస్ సర్వీస్ డిస్ట్రిబ్యూటర్ రాజా విజయకుమార్, శరణ్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ రామాంజనేయులు, సేల్స్ ఆఫీసర్ బొరుగుల సురేష్, ఐటీఐ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

రుద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రుద్ర వరం గ్రామ సమీపంలోని దొర్నిలక్ష్మీనరసింహ స్వామి జీర్ణోద్ధరణ పనులకు పత్తిరామక్రిష్ణ, లక్ష్మీదేవి దంపతులు రూ.50,116 విరాళంగా మంగళవారం అందించారని దేవదాయ నిర్వాహకుడు బండల శ్రీను తెలిపారు. విరాళమందించిన దాతలు మాట్లాడుతూ దొర్ని లక్ష్మీనరసిం హస్వామి దేవాలయ అభివృద్ధికి విరాళమందించడం సంతృప్తిగా ఉంద న్నారు. ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ తదితరులు ఉన్నారు.


ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాతలు

నమో నారసింహా..

రుద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నమో నారసింహా అంటూ భక్తులకు ఉత్సవ పల్లకీలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు మంగళ వారం ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని తిప్పారెడ్డిపల్లె గ్రామంలో పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు పూజలు చేశారు. సాయంత్రం పార్వేట పల్లకీ టి.లింగందిన్నె గ్రామానికి చేరుకుంది.

కమనీయం.. వెంకటేశ్వరస్వామి కల్యాణం


ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

చాగలమర్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్ల పల్లె గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన వెంకటే శ్వరస్వామి కల్యాణం వేద పండితుల ఆధ్వర్యంలో అత్యంత కమనీయంగా జరిగింది. ఆలయంలో ఉభయదారులచే కల్యాణోత్సవం, చేశారు. తాళిబొట్టు కట్టించి తలంబ్రాలు పోయించారు. కల్యాణోత్సవం లో పాల్గొన్న భక్తులు పెళ్లి చదివింపులు చదివించారు. కార్యక్రమంలో ఉభయదారులు పులి చిన్నఓబుళరెడ్డి, పద్మావతమ్మ, వనజారెడ్డి, వందనా రెడ్డి, ఓబుళరెడ్డి, ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన గణపతి, అంజనేయ, వీరభద్ర, విగ్నేశ్వరస్వామి ఆలయాల్లో మంగళవారం వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో ఉభయదారులచే పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు అవుకుకు మంత్రి బీసీ రాక

అవుకు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రానికి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి బుధవారం వస్తున్నట్లు ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అభినయ్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సొంత నిధులతో సమాకూర్చిన రూ. 20 లక్షలు విలువ వైద్య పరికరాలను ఆసు పత్రికి అందజేయనున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల గుర్తింపు సర్వే పరిశీలన

చాగలమర్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో అర్హులైన దివ్యాంగులను గుర్తించేందుకు చేస్తున్న ఇంటింటి సర్వేను మంగళ వారం వైద్యులు అంజలి, న్యాయవాది మోహన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆళ్లగడ్డ జిల్లా అదనపు జడ్జి, మండల లీగల్ సర్వీస్ అథారిటీ కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. సర్వేను వేగ వంతం చేయాలని సూచించామని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గార్లెట్, ఆశా వర్కర్లు ఉన్నారు.

చౌడేశ్వరీదేవికి బోనాల సమర్పణ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామంలో చౌడేశ్వరీ మాతకు బోనాల సమర్పణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మాఘమాసం మంగళవారం పురస్కరించుకొని గ్రామపెద్దల ఆధ్వర్యంలో సామూహిక బోనాల సమర్పణ, కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, వెంకటమల్లారెడ్డి, పెద్దిరెడ్డి, గ్రామ సర్పంచ్ శివ శంకర్, ఉపసర్పంచ్ రామలక్ష్మణ్ణ లైన్ ఇన్‌స్పెక్టర్ జయానాయక్ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

విరామంతో.. ఉపశమనం

చాగలమర్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో తెలియని ఒత్తిడి, ఆందోళన క్రమేపి పెరుగుతోంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పగలు, రాత్రి చదువుతారు. కొందరు పరీక్షల సమయానికి చదివిన వాటిలో కొన్ని మరిచిపోతుంటారు. ఈ కారణంగా ఆశించిన స్థాయిలో మార్కులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడతారు. ఇంకొందరు అయితే ఆహారంపై దృష్టిపై దృష్టి సారించక చదువుతో నీరసించి పోతారు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేలా ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం వచ్చేలా టైమ్‌టేబుల్ ప్రకటించింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- టెన్త్ పరీక్ష పరీక్షకు మధ్య గ్యాప్
- విద్యార్థులు ఒత్తిడి నుంచి బయట పడేసేందుకు నిర్ణయం
- పక్కాగా పరీక్షలకు సిద్ధం


కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటున్న పది విద్యార్థులు

జిల్లాలో పదోతరగతి విద్యార్థులు 28,294 మంది ఉన్నారు. ఇందులో బాలికలు 12,085, బాలురు 13,209 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో చాగలమర్రి 756 మంది, ఆళ్లగడ్డ 1,392, దొర్నిపాడు 196, రుద్రవరం 470, శిరివెళ్ల 623, ఉయ్యాలవాడ 285 మంది చదువుతున్నారు. ఈ విద్యార్థులు ఈ ఏడాది పది పబ్లిక్ పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతున్నారు. గతంలో పది పరీక్షలను రోజుకు ఒకటి చొప్పున నిర్వహించడం వల్ల విద్యార్థులు ఆందోళనకు గురయ్యేవారు. పండుగ, వారాంతపు సెలవులు వస్తే తప్పా విరామం వచ్చేది కాదు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా పాఠ్యంశాలకు రెండు పేపర్ల విధానం తొలగించి 100 మార్కులకు గాను ఒకే పేపర్ విధానంతో పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థుల్లో మరింత భారం పెంచినట్లైంది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పదోతరగతి పరీక్షల షెడ్యూల్ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. వచ్చేనెల మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి పరీక్షకు మధ్య ప్రభుత్వం ఒక రోజు విరామం ప్రకటించగా గణితం, సాంఘీక శాస్త్రం పరీక్షలకు అదనంగా మరో రోజు విరామం వచ్చింది. విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, అదనపు తరగతుల నిర్వహణ, నిత్యం చిన్న చిన్న పరీక్షలు పెట్టడం, అవసరమైన పాఠాల పునఃశ్చరణ, ప్రీఫైనల్ నిర్వహించి భయం పోగడతారు. వంద రోజుల ప్రణాళికలో ఎంఈవోలు పర్యవేక్షణ చేసి హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ప్రోత్సహిస్తూ పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు.


చాగలమర్రి బాలికల పాఠశాలలో పది విద్యార్థుల స్టడీని పరిశీలిస్తున్న ఎంఈవో అనూరాధ

విరామం రావడం విద్యార్థులకు మేలు



పది పరీక్షల్లో పరీక్ష పరీక్షకు మధ్య ఒక రోజు విరామం రావడం ఇదే తొలిసారి. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విధానం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. దీంతో ఉత్తీర్ణత శాతం పెరగడంతో పాటు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఒక్కరోజు విరామం నిర్ణయం వల్ల విద్యార్థులకుఎంతో మేలు చేకూరుతుంది.

- న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి

చెంచుల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

1.85 లక్షల చేపపిల్లలను వదిలిన ఎమ్మెల్యే

రుద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చెంచుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం నల్లమల అటవీలోని తుండ్లవాగు రిజర్వాయరులో 1.85లక్షలు చేపపిల్లలను ఎమ్మెల్యే వదిలారు. ఈ సందర్భంగా ఆమె చెంచులతో ముఖాముఖిగా మాట్లాడారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు జేబులు నింపుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. ఏదైనా ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టించి ఇబ్బందులు పెట్టడం తప్ప ఏ రోజైనా చెంచుల గురించి ఆలోచించారా అని అన్నారు. రూ.2లక్షలు విలువ చేసే 1.85లక్షల చేపపిల్లలను వదలడం జరిగిందన్నారు. టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ శ్రీశైలం పీవో శివప్రసాద్, జేడీ రాఘవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు సంజీవరాయుడు, పిల్లి సుబ్బారావు, రామలింగం, అహోబిళం సంజీవరాయుడు, అంజి, ఐటీడీఏ ఏపీవో రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


రిజర్వాయరులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

రైతుల ముఖాల్లో ఆనందం చూడాలి: ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతుల ముఖాల్లో ఆనందం చూడలన్నదే సీయం చంద్రబాబు లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో ఆయన రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కోట్ల మాట్లాడుతూ నియోజకవర్గంలోని 38 చెరువులను హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నీరు నింపి రైతుల సాగునీటి కష్టాలను తీరుస్తామన్నారు. అలాగే అర్హులైన వారందరికి ప్రభుత్వ ఫలాలు అందిస్తామన్నారు. గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనతరం మాధవరం గ్రామం రైతులు హంద్రీ, నీవా ద్వారా తమ చెరువు నీరు అందించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వై లక్ష్మీనారాయణయాదవ్, ఆర్ఈ నాగరాజు, సీతపతిస్వామి, కరణం రామ్, రాజా నారాయణమూర్తి, లక్ష్మీనారాయణ, కుమ్మరి సుధాకర్, పుల్లారెడ్డి, ప్రసాద్, ఖాజాపీర్, గోవిందు, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

సిమెంటు ఫ్యాక్టరీ నిర్వహణపై ఎమ్మెల్యే ఆరా

బేతంచెర్ల : సిమెంటు ఫ్యాక్టరీ నిర్వహణపై యాజమాన్య ప్రతినిధితో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మంగళవారం సిమెంటునగర్‌లో ఉన్న గెస్టు హౌస్‌లో ఆరా తీశారు. సిమెంటు ఫ్యాక్టరీ యజమాన్యం, నిర్వహకులు తీరుపై ఫ్యాక్టరీలో పని చేస్తున్న సిబ్బంది అసంతృప్తిగా ఉండడం, దాదాపు మూడు నెలల నుంచి ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే కోట్ల వివరాలు సేకరించారు. ఫ్యాక్టరీ యజమాన్యాన్ని ఎమ్మెల్యే నిలదీయడంతో తదుపరి కార్యకలాపాలపై కొంత సమయం ఇవ్వాలని కోరారు. ఇచ్చిన గడువు ముగిసేలోపు ఫ్యాక్టరీ పనులు పునఃప్రారంభించాలని లేనిపక్షంలో ఫ్యాక్టరీని తమ స్వాధీనంలోకి తెచ్చుకుని కార్మికులకు, స్థానికులకు ఉపాధి పని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, ఫ్యాక్టరీ కార్యకలాపాలపై వచ్చే అపోహలపై ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే కోట్ల స్థానికులకు అభయం ఇచ్చారు. వీటితో పాటు నేషనల్ హైవే అయిన 340బి పనులు వేగవంతంగా జరుగుతుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు నెలకొనడంతో బేతంచెర్ల-కర్నూలు రహదారిని తాత్కాలికంగా మూసివేసి, రహదారిని మళ్లించబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాహనదారులు బుగ్గానపల్లి సిమెంటు నగర్, తమ్మరాజుపల్లె మీదుగా వాహనాలు మళ్లిస్తున్నామని, ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, ఫ్యాక్టరీ యజమానులు వీపీ శ్రీనివాసులు, హైవే ప్రాజెక్టు మేనేజర్ జయరాం, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య పాల్గొన్నారు.

పొలాన్ని అక్రమంగా ఆన్‌లైన్ చేశారు..

ప్యాపిలి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేకుండానే అక్రమంగా పొలాన్ని ఇతరులకు ఆన్‌లైన్ చేశారని మండలంలోని మాండొడ్డి గ్రామానికి చెందిన రైతు ఆంజినేయులు, లక్ష్మి దంపతులు ఆరోపించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులను కలసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. మాండొడ్డి గ్రామంలో తనకు 189-1 సర్వే నెంబరులో 2 ఎకరాల పొలం ఉందని, ఈ పొలాన్ని 2002లో తమ గ్రామానికి చెందిన రమణ అనే వ్యక్తి పేరుపై ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమంగా ఆన్‌లైన్ చేసిన తన సర్వే నెంబరు తొలగించి న్యాయం చేయాలని రైతు దంపతులు సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డిని కోరారు. సమస్యను తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సొదరిదిన్నె ఫీల్డ్ అసిస్టెంటు రాజీనామా

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : సొదరిదిన్నె గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేసే ఎ.మాబు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంపీడీవో మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వల్ల ఫీల్డ్అసిస్టెంటు పదవికి రాజీనామా చేస్తున్నట్లు వినతిపత్రం అందించారన్నారు.

అందరి సహకారంతో గ్రామ పంచాయతీ అభివృద్ధి : సర్పంచ్

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీ అభివృద్ధి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని సర్పంచ్ మెట్ల సరళ అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గసభ్యులు, అధికారులతో సర్పంచ్ మెట్ల సరళ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సమావేశంలో అజెండా ప్రకారం గ్రామపంచాయతీలో చేయాల్సిన పనులపై ఆమోదం కోసం వివరించారు. అలాగే పట్టణంలోని వివిధ సమస్యలను పాలకవర్గ సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా వాటన్నంటిని పరిష్కరించాలని సర్పంచ్ ఈవోఆర్‌డీకి సూచించారు. సర్పంచ్ మాట్లాడుతూ అధికారులు, ప్రజలు, పాలకవర్గసభ్యుల సహకారంతో ఉత్తమ మేజరు గ్రామ పంచాయతీగా ఎంపిక కావడంతో తాము ఢిల్లీలో ప్రశంసాపత్రం అందుకున్నామన్నారు. కోవెలకుంట్ల పేరును ఢిల్లీలో వినిపించేలా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పాలకవర్గ సభ్యులు సర్పంచ్ మెట్ల సరళను ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు .ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, జీసీఆర్ సుధీర్ రెడ్డి, ఈవోఆర్‌డి ప్రకాశ్‌నాయుడు, పాలకవర్గసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

శిరివెళ్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కంప్యూటర్ సబ్జెక్టును బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇంద్రావతి మంగళవారం తెలిపారు. కళాశాలలో ఆమె మాట్లాడుతూ కంప్యూటర్ పీజీ విభాగంలో 55 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. అలాగే బోధన వృత్తిలో అనుభవం ఉన్నవారికి, నెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 25వ తేదీలోగా తమ దరఖాస్తులను కళాశాలకు పంపి ఒరిజినల్ సర్టిఫికెట్లతో డెమో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఉచిత శిక్షణా తరగతులు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇంద్రావతి తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చని.. మూడు నెలల శిక్షణ అనంతరం ప్రభుత్వ గుర్తింపుతో కూడిన సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 25వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఉడుములపాడులో మేలుజాతి దూడల ప్రదర్శన

డోన్ రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడుములపాడు గ్రామంలో రాష్ట్ర గోకుల్ మిషన్ పథకం కింద మేలుజాతి దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాగోవిందు నాయక్ హాజరై ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో 63 మేలు జాతి గేదె, ఆడదూడలు, ఒంగోలు జాతి దూడలు రైతులు ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహణ అధికారి రాజశేఖర్, డోన్ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, సర్పంచ్ రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

చాగలమర్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెంకటేశ్వర స్వామి, గణపతి, వీర భద్ర, అంజనేయ, సాయిబాబా ఆలయాల ప్రతిష్ట దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలను మంగళవారం రైతు పులి చిన్న ఓబుళరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 16 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి 125 సీసీ ద్విచక్రవాహనం, రెండో బహుమతి 100 సీసీ ద్విచక్రవాహనం, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గొ బహుమతి రూ.30 వేలు నగదును దాతలు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.


రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న రైతు చిన్న ఓబుళరెడ్డి

త్రివిక్రమవర్మ మృతి బాధాకరం

అవుకు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అవుకు రాజవంశీకులైన నంద్యాల త్రివిక్రమ వర్మ (64) మృతి చెందడం బాధాకరమని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. బీసీ ఇందిరమ్మ అవుకుకు చేరుకొని త్రివిక్రమవర్మ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్, ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి, చల్లా విఘ్నేశ్వరరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు దంతెల రమణ, తిక్కన్న, అరుణ్‌కుమార్‌నాయక్, వెంకటరాముడునాయక్, త్రివిక్రమవర్మ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


త్రివిక్రమవర్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ

శనగకు గిట్టుబాటు ధర కరువు

సంజామల, ఫిబ్రవరి 18: రబీలో సాగైన శనగ పంట గిట్టుబాటు ధర కరువైంది. మండల వ్యాప్తంగా రబీలో 17000వేల హెక్టార్లలో రైతులు జెజి 11 (ఎర్రవి), పూలేజి (తెల్లవి) వంటి రకాల పంటలను సాగు చేశారు. వంట సాగు నుండి కలుపులు, పురుగుల బెడద క్రిమి సంహారక మందులకోసం వేల రూపాయలు పెట్టుబడి పెట్టించారు. పంట పూత దశలో ఉన్నప్పుడు పొంగ మంచి (మొగలి) కురవడంతో పూతంతా రాలిపోయి పంట దిగుబడి తగ్గింది. గత నెల క్రితం క్వింటా శనగలు రూ.7500 ఉండగా ప్రస్తుం మార్కెట్‌లో రూ. 5500లకు విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో దిక్కుతోచని రైతులు దళారి వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు రైతు నుండి కరువు రూపంలో భారీగా లాగేస్తున్నారు. 50కేజీల ప్యాకెట్‌కు 2 నుండి 3కేజీలు తరుగు మింగేస్తున్నారు.



ఎక్స్‌ప్రెస్ బస్సు కొలిమిగుండ్లకు రానంటోంది..!

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కడప, అనంతపురం జిల్లాలకు చెందిన పలు ఆర్టీసీ బస్సులు కొలిమిగుండ్ల టౌన్‌లోకి రాకుండా జమ్మలమడుగు సర్కిల్ నుంచి వెళ్లి పోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతపురం, బళ్లారి నుంచి తాడిపత్రి, బుగ్గ కొలిమిగుండ్ల మీదుగా ప్రొద్దుటూరు, కడప, బద్వేల్ బ్రహ్మంగారిమఠం, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ కొలిమిగుండ్ల మీదుగా వెళ్తున్నాయి. అయితే నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవే కొలిమిగుండ్ల టౌన్ తగలకుండా జమ్మలమడుగు సర్కిల్ నుంచి వెళుతుంది. దీంతో ఆర్టీసీ బస్సులు టౌన్‌లోకి రావడం లేదు. బస్సులు రాక పోవడంతో ప్రయాణికులు ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే ఇతర ఆర్డీనరీ బస్సులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జమ్మలమడుగు సర్కిల్ నుండి కొలిమిగుండ్ల టౌన్ ఆర్టీసీ బస్టాండులోకి కేవలం అర్ధ కిలోమీటరు దూరం మాత్రమే ఉంది. కర్నూల్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని బస్సులు టౌన్‌లోకి వచ్చేలా చూడాలని కోరుతున్నారు.


కొలిమిగుగుండ్ల టౌన్‌లోకి రాకుండా సర్కిల్ నుంచి వెళుతున్న బద్వేల్ బస్సు

పూర్తి కాని పాఠశాల భవన నిర్మాణ పనులు

రుద్రవరం, ఫిబ్రవరి 18 (ఆంధ్ర జ్యోతి) : రుద్రవరం మెయిన్ పాఠశాలలో నాలుగేళ్లుగా పాఠశాల భవనం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పాఠశాలలో 1, 2 తరగతులు ఉండగా 35 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు నేడు కింద రూ.50లక్షలు కేటాయించారు. వీటిలో రూ.22 లక్షలు మంజూరైంది. ఇంకా 28 లక్షలు మంజూరు కావాల్సి ఉంది. వచ్చే విద్యాసంవత్సరంలో 1 నుంచి 5వరకు విద్యార్థులు ఇక్కడే విద్యనభ్యసిస్తారు. నాలుగేళ్లుగా నిర్మాణ పనులు నిలిచిపోయినా పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ విషయంపైహెచ్ఎం సుదర్శన్ మాట్లాడుతూ పనులు నిలిచిపోయినట్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.


రుద్రవరంలో మెయిన్ పాఠశాలలో నిలిచిపోయిన పాఠశాల నిర్మాణ పనులు